
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
మంగళవారం 30 జనవరి 2024



లష్కర్‌వారం బుకింగ్ ఆదాయం
రూ.59 లక్షలు

- కొమురెల్లి మల్లన్నకు గతేడాది కంటే ఈసారి రూ.20 లక్షలు అదనపు ఆదాయం

7లో..



రహదారిపైనే కూరగాయల అమ్మకం

కొంపముంచిన కుమ్ములాటలు

- దుబ్బాక మున్సిపాలిటీలో బాధ్యతను మరిచిన పాలకవర్గం
- శాపంగా మారిన ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- పట్టణంలో అభివృద్ధి పనులపై అశ్రద్ధ
- ఫలితంగా గతంలో మంజూరైన నిధులు వెనక్కి

7లో..

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ నా ఆత్మబంధువులే

- ఎవరు ఆపదలో ఉన్నా సాయం చేస్తా
- జగ్గారెడ్డి ఓట్ల కోసమే ఏదీ చేయడని ప్రజలకు తెలుసు
- పదేళ్లలో నేనేం చేశానో.. 9 ఏళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో కళ్ల ముందు ఉన్నది
- గెలిస్తే సంగారెడ్డి అభివృద్ధికి సీఎంను నిధులడిగే వాడిని
- త్వరలో కార్యకర్తలతో సమావేశమవుతా
- మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 29 : సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ తన ఆత్మబంధువులని, తానెప్పుడూ వారిని ఓటర్లుగా చూడలేదని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో తనకు ఓట్లేసిన 70వేల మందికి తానే జవాబుదారీగా ఉంటానన్నారు. తనకు ఓట్లేయని 80వేల మందికి కూడా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జగ్గారెడ్డి ఓట్ల కోసం ఏదీ చేయడనే విషయం సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని, ఎవరు ఆపదలో ఉన్నా చేతనైన సాయం వెంటనే చేస్తానని అన్నారు. ఒకసారి మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని, రెండుసార్లు ఓడిపోయానని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాను చెప్పినట్టుగానే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. తాను ఓడిపోయినప్పటికీ ప్రజల ఆలోచన మేరకు పనిచేస్తానని వెల్లడించారు. దసరా, బోనాలు, శ్రీరామ నవమి, శివరాత్రి, వినాయక చవితి పండగల నిర్వహణ కోసం సంవత్సరానికి రూ. 8 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు ఖర్చు చేస్తుంటానని తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షల్లో ఇఫ్తార్ విందులు, క్రిస్మస్ పండగకు కేక్‌లు ఇచ్చి సంతృప్తి చెందుతానని అన్నారు. ఓట్ల కోసమే అయితే ఇన్ని కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తానని, ఎన్నికల సమయంలో ఖర్చు చేస్తే సరిపోతుంది కదా? అని పేర్కొన్నారు. అలాగే ఎక్కడ జాతరలు, పండుగలకు పిలిచినా ఉత్త చేతులతో ఏనాడూ వెళ్లలేదని స్పష్టం చేశారు. తాను పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా వున్నప్పుడు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశానో ప్రజలందరికీ తెలుసని అన్నారు. 2014లో తాను ఓడిపోయినా సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం పోరాటం చేశానని గుర్తుచేశారు. 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మెడికల్ కాలేజీని సాధించానని పేర్కొన్నారు. గత తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం సంగారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని జగ్గారెడ్డి విమర్శించారు. తనను గెలిపించి ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి సంగారెడ్డి అభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చేవాడినని, కానీ ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని అడగాలో ప్రజలు ఆలోచించాలని అన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ప్రజలు కోరుకునే పనులు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తానని, అనంతరం ప్రజలందరినీ కలుస్తానని తెలిపారు.

ఆరు గ్యారంటీ స్కీంలకు దరఖాస్తు చేసుకోండి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంల కోసం నియోజకవర్గ ప్రజలంతా దరఖాస్తు చేసుకోవాలని జగ్గారెడ్డి సూచించారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే సంగారెడ్డి రాంనగర్‌లోని తన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తన భార్య నిర్మలారెడ్డి నియోజకవర్గంలో పనులన్నీ చూసుకుంటున్నారని, ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులందరూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

త్వరలోనే సాగునీరు

- గండిపల్లి ప్రాజెక్టు పనులను కూడా ప్రారంభిస్తాం
- సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్యాయం చేసింది
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పలు మండలాల్లో మంత్రి సుడిగాలి పర్యటన



అక్కన్నపేట మండలం గండిపల్లిలో పల్లె దవాఖానను ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, జనవరి 29: త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం రాత్రి అక్కన్నపేట మండలంలోని గండిపల్లి, జనగామ, అంతకపేట, రేగొండ గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, పల్లె దవాఖాన, మహిళా సమైఖ్య భవనం, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. అంతకపేట నుంచి గుబ్బడి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని, ఎన్‌జీటీ నుంచి త్వరలోనే అనుమతులు వస్తాయని స్పష్టం చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి గండిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లను అందిస్తామని అందుకు సంబంధించి ప్రాజెక్టు పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచుల పదవీకాలం పూర్తవుతుందని, ఇక నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన అందిస్తామని స్పష్టం చేశారు. సర్పంచుల బిల్లులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్యాయం చేసిందని మంత్రి ఆరోపించారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు న్యాయపరంగా ఉంటే ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. వేసవికాలంలో నియోజకవర్గంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా శాస్త్రీయబద్ధంగా జిల్లాలు, మండలాలు, గ్రామాలను రిటైర్డ్ జడ్జి, నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి పునర్విభజన చేపడతామని వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటై 60 రోజులు పూర్తికాక ముందే బీఆర్ఎస్ నాయకులు అవాకులు, చెవాకులు పేలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని మాట్లాడుతున్న నాయకులు ఒళ్లు, నోరు దగ్గర పెట్టుకోవాలని లేదంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీపీ మాలోతు లక్ష్మి, జడ్పీటీసీ భూక్య మంగ, సింగిల్ విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, సర్పంచ్‌లు ముత్యాల సంజీవరెడ్డి, ఇర్రి లావణ్య రాజిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో వైద్యసిబ్బందితో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన

హుస్నాబాద్‌రూరల్, జనవరి 29: హుస్నాబాద్ మండలంలో రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం రాత్రి సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కూచనపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం పందిల్లలో పల్లెదవాఖానను ప్రారంభించారు. రాత్రి 11:30 గంటలకు రాములపల్లి, వంగరామయ్యపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని, వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, సర్పంచ్ తొడేటి రమేశ్ వైద్యాధికారి నిఖిత, ఆయా శాఖల అధికారులు, పలువురు పాల్గొన్నారు.



కొండపోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

కొండపోచమ్మకు భక్తుల రద్దీ



కొండపోచమ్మ అమ్మవారు

జగదేవ్‌పూర్, జనవరి 29: కొండపోచమ్మ జాతర ఉత్సవాలు ఈనెల 22న ప్రారంభం కాగా లష్కర్‌వారం (రెండోవారం) సందర్భంగా ఆదివారం కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు సాయంత్రం నుంచి కొండపోచమ్మ బాట పట్టారు. రాత్రి అక్కడే బస చేసి సోమవారం ఉదయం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల నృత్యాలు, శివసత్తుల శిగాలు, డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి చెంతకు చేరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ఆలయ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గత వారం కంటే రెండో వారం భక్తుల సంఖ్య తగ్గిందని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు.

సెల్‌ఫోన్ పోయిందా..
టెన్షన్ పడకండి

- సీఐఈఆర్‌లో లాగిన్ అయితే త్వరగా పట్టుకుంటాం
- సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ వెల్లడి
- 30 సెల్‌ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగింత

7లో..

పాడిరైతుల ఆందోళన

- పాల తిరస్కరణపై దూల్మిట్ట పాడి రైతుల ఆగ్రహం
- సేకరణ తగ్గించాలనే కుట్రలు చేస్తున్నారని ఆరోపణ
- పరిహారం చెల్లిస్తామని డెయిరీ డీడీ హామీతో విరమణ

చేర్యాల, జనవరి 29 : అకారణంగా పాలను తిరస్కరిస్తూ అపారనష్టం చేకూర్చడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ దూల్మిట్ట మండల పాడిరైతులు సోమవారం చేర్యాల పాలశీతలీకరణ కేంద్రం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పాలశీతలీకరణ కేంద్రం, డెయిరీ అధికారుల తీరుపై మండిపడ్డారు. చాన్నాళ్లుగా విజయ డెయిరీకి పాలు పోస్తున్నామని, తాము ఎలాంటి కల్తీ చేయకున్నా, రెండు రోజులుగా నిత్యం 1200 నుంచి 1500 లీటర్ల పాలను తిరస్కరించారని వాపోయారు. అధికారులు కేవలం పాల సేకరణ తగ్గించాలన్న దురుద్దేశంతోనే ఇలా తిరస్కరిస్తున్నారని వాపోయారు. ప్లాంట్ ఆపరేటర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతోనే అవగాహన లేక సమస్యలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. రెండునెలలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఇన్‌చార్జికి డెయిరీ అధికారులు ఒత్తాసు పలకడం తగదని ఈ సందర్భంగా సూచించారు. రెండు రోజులుగా తమకు జరిగిన నష్టానికి పరిహారం అందించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. వీరి ఆందోళనకు బీజేపీ రాష్ట్ర నాయకుడు అంకుగారి శశిధర్‌రెడ్డి, సీపీఎం నాయకులు కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్‌కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ విషయమై బీసీయూ ఇన్‌చార్జి మురళి అందుబాటులో లేకపోవడతో సిద్దిపేట డీడీ గోపాల్‌సింగ్‌కు ఫోన్ చేసి తమకు న్యాయం చేసే వరకు ఆందోళన విరమించబోమని తేల్చిచెప్పారు. రెండురోజులుగా పాలతిరస్కరణతో జరిగిన నష్టానికి పరిహారం అందిస్తామని డీడీ గోపాల్ సింగ్ హామీ ఇచ్చారని, తద్వారా ఆందోళన విరమించుకుంటున్నట్లు పాడిరైతులు తెలిపారు.



తిరస్కరణతో పాడైపోయిన పాలను రోడ్డుపై పారబోస్తూ నిరసన తెలుపుతున్న పాడిరైతులు

గొల్లకురుమలను మోసం చేసిన కేసీఆర్

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్

మెదక్ అర్బన్, జనవరి 29: సబ్సిడీ గొర్రెలను అందిస్తామని గొల్లకురుమలను మాజీ సీఎం కేసీఆర్ మోసం చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ఆరోపించారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల యూనిట్ల కోసం అధిక వడ్డీకి డబ్బును తీసుకొచ్చి డీడీలు చెల్లించారన్నారు. రేపు.. మాపు అంటూ రెండేళ్లుగా అప్పటి బీఆర్ఎస్ సర్కార్ కాలయాపన చేసిందన్నారు. గతంలో పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా 1942 మంది డీడీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కట్టిన నగదును వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అయినా గొర్రెల యూనిట్లు అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మల్లేష్, యాదవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు రమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ యాదవ్, సెక్రటరీ బాల్‌రాజ్ యాదవ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గొల్లకురుమ లబ్ధిదారులు

పైసలిస్తేనే పని!



- ఏ అనుమతి కావాలన్నా కాసులివ్వాల్సిందే!!
- ఇదేంటని అడిగితే డాక్యుమెంట్లు సరిగాలేవంటూ తిరస్కరణ
- సిద్దిపేట మున్సిపల్ అధికారుల వింతపోకడ!
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ఇంటి యజమానులు

సిద్దిపేట టౌన్, జనవరి 29 : సిద్దిపేట పట్టణ శివారులోని గెటెడ్ కమ్యూనిటీ కాలనీలో ఓ వ్యక్తి ఇటీవల ఇల్లును కొనుగోలు చేశాడు. ఇంటి పేరు మార్పు కోసం మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. సంబంధిత మున్సిపల్ బిల్ కలెక్టర్ సదరు యజమానిని కలిసి ఇంటి పేరు మార్పు కావాలంటే తనకు రూ.5వేలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. పని కావాలన్న ఉద్దేశంతో సదరు బిల్ కలెక్టర్‌కు రూ.5వేలు చెల్లించాడు. మరికొన్ని రోజులకు యజమానిని బిల్ కలెక్టర్ మరిన్ని డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో ఇంటి యజమాని ఇవ్వనని చెప్పడంతో బిల్ కలెక్టర్ తీసుకున్న డబ్బును తిరిగి యజమానికి చెల్లించాడు. ఆ తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న సదరు ఇంటి యజమాని ఉన్నతాధికారులను ఆశ్రయించి సమస్యను వివరించి ఎట్టకేలకు పేరు మార్పు చేయించుకున్నాడు. ఇదొక్కటనే కాదు... నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాలన్నా, టౌన్ ప్లానింగ్, ఇతరత్రా వాటికి సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా సిద్దిపేట మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. కూలి, నాలి చేసి ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగులు డబ్బు కూడ బెట్టి సొంతింటి కలను సాకారం చేసుకుందామంటే మున్సిపల్ అధికారులు వాటికి అడ్డుపడుతున్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు, సిబ్బంది కాసులకు కక్కుర్తిపడుతూ అనుమతులు ఇవ్వకుండా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంగా మారడంతో పాటు పట్టణం నలువైపులా విస్తరించింది. ఆయా కాలనీల్లో ఇల్లు నిర్మించుకుందామని మున్సిపల్‌ను ఆశ్రయిస్తే కొంత మంది బిల్ కలెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది కుమ్మకై అనుమతులు ఇంటి పేరు మార్పిడి, ట్రేడ్ లైసెన్స్ ఇతరత్రా వాటికి చెయ్యి తడపనిదే పనిచేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే!!

సిద్దిపేటలో నూతనంగా ఇల్లు నిర్మించుకోవాలంటే అనుమతి కోసం సంబందిత డాక్యుమెంట్లతో, ఫీజును చెల్లించి మున్సిపల్ కార్యాలయంలో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మున్సిపల్ అధికారులు పరిశీలించి అనుమతులనివ్వాల్సి ఉంటుంది. బిల్ కలెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సైట్‌ను సందర్శించి ఇంటి యజమానిని కలిసి ఇల్లు అనుమతి కావాలంటే తమకు ఎంతో కొంత ఇవ్వాలని చెబుతున్నారు. ఇంటి యజమానులు చేసేది లేక సదరు సిబ్బందికి అడిగినంత డబ్బును ఇస్తున్నారు. కొందరు ఇంటి యజమానులు డబ్బులివ్వకుంటే డాక్యుమెంట్లు సరిగా లేవని, తిరిగి సంబంధిత డాక్యుమెంట్లను సరిచేసి దరఖాస్తు చేసుకోవాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



కొరవడిన పర్యవేక్షణ

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు నాయకుల అండతో ఆడింది ఆట..పాడింది పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారస్తులు బ్యాంకు లోన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ట్రేడ్ లైసెన్స్ కచ్చితంగా అవసరం ఉంటుంది. అయితే మున్సిపల్‌లో దరఖాస్తు చేసుకుంటే డబ్బులివ్వకుంటే ట్రేడ్ లైసెన్స్‌లను ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు వింత పోకడను ప్రదర్శిస్తున్నారు. ఇలా మున్సిపల్ నుంచి జారీ చేసే ప్రతి సర్టిఫికేట్, వివిధ వాటికి అవసరమయ్యే ప్రతి దానికి దరఖాస్తు చేసుకున్న వారు, తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రహరీ కూల్చేసిన అధికారులు

సిద్దిపేటలోని 12వ వార్డులోని రాఘవేంద్రనగర్ కాలనీలో పసుపునూరి నిర్మల ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి నిర్మించారంటూ ఇటీవల అధికారులు ప్రహరీ కూల్చేశారు. బాధితులు మాత్రం స్థానికంగా ఉండే నాయకుడు ఇంటి నిర్మాణం కోసం రూ2 లక్షలు లంచం అడిగితే ఒప్పందం ప్రకారం ఇచ్చినట్లు తెలిపారు. తిరిగి మరింత లంచం ఇవ్వాలని కోరితే ఇవ్వకపోవడంతోనే అధికారులతో కలిసి తమ ఇంటి ప్రహరీ కూల్చివేశారని ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయంలో డబ్బులివ్వనిదే ఏ పని జరగడం లేదని, సిబ్బంది మామూళ్లకు అలవాటు పడ్డారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని పేద కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి సూరిక్రిష్ణ

జహీరాబాద్, జనవరి 29: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ సూరిక్రిష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బీసీ బాలుర వసతీగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలని అన్నారు. నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి చట్టాలు దోహదపడుతాయని అన్నారు. బాల్య వివాహాల బాధితులు, బాలకార్మికులను గుర్తిస్తే పోలీసులకు, తహసీల్దార్‌కార్యాలయ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్‌కుమార్, న్యాయవాదులు, ఇబ్రహీం, మహేష్, శేఖర్, జగన్, బ్రహ్మానందరెడ్డి, మహేందర్, లీగల్‌సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, వసతిగృహ ఇన్‌చార్జి వంశీక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి సూరిక్రిష్ణ

నీటిని అక్రమంగా తరలిస్తున్న ట్యాంకర్ సీజ్

కంది, జనవరి 29: కంది మండల పరిధిలోని చేర్యాల, ఇంద్రకరణ్, కంది, కాశీపూర్ తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇంద్రకరణ్ గ్రామంలో అనుమతులు లేకుండా వ్యవసాయ బోరు ద్వారా నీటినీ తోడి, పరిశ్రమలకు తరలిస్తున్న ఓ ట్యాంకర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలో వ్యవసాయానికి ఉపయోగించే నీటిని ఎవరైనా అక్రమంగా ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు, ఇతరత్రా అవసరాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో సీనియర్ అసిస్టెంట్ సంతోష్‌శర్మ, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

శివ్వంపేట, జనవరి 29: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం దొంతి గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన జోగిని పోచమ్మ, పోచయ్యల చిన్న కుమారుడు రవి(32) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన రవి భార్యతో తరుచూ గొడవపడేవాడు. రవి ఈనెల 27న శభాష్‌పల్లిలోని ఓ పరిశ్రమ వెనుకాల పురుగుమందు తాగి తల్లికి ఫోన్ చేశాడు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్ రావు తెలిపారు.

పుట్టకోట భూమి ప్రభుత్వానిదే

● బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

తూప్రాన్, జనవరి 29: తూప్రాన్ పట్టణంలోని పుట్టకోట ప్రాంతంలో అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్న కోట భూమిలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. తూప్రాన్ పట్టణంలోని పుట్టకోట పరిధిలోని రెండు బురుజుల మధ్య ఉన్న భూమికి ఇంటి నంబరు ఏర్పాటు చేసి వేల గజాలు అమ్మకాలు చేశారు. అప్పట్లో ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ భూమిపై చర్యలకు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ భూమి ప్రభుత్వ భూమి అంటూ సోమవారం బోర్డు పెట్టారు.

విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు

● మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి



ప్రశంసాపత్రాన్ని బహూకరిస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

పెద్దశంకరంపేట, జనవరి 29: విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో క్యూబ్, రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 54 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పది వేల చొప్పున ఉపకార వేతనం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ విద్య వికాసాన్ని అందిస్తుందని అన్నారు. అన్ని దానాల్లో కన్నా విద్యా దానం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రభుత్వపాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక వసతులు కల్పించాలని ఫౌండేషన్ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఎస్ఆర్ అనూజ్ మైత్రి మెదక్ డీఎస్పీ ఫణికుమార్, టీఎల్ఎంఎస్‌వి సయ్యద్ అహ్మద్ షేక్, ఆర్ఈఎంఎస్‌విఎండీ రెహమాన్‌ఖాన్, అల్లాదుర్గం సీఐ జార్జ్, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు, పాల్గొన్నారు.

కొమురవెల్లి ఆలయంలో లష్కర్‌వారం బుకింగ్ ఆదాయం రూ.59 లక్షలు

చేర్యాల, జనవరి 29 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా లష్కర్‌వారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులుతీర్చుకున్నందున రూ.59 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, రచించిన పట్నాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతిగదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.5,97,344, ఆదివారం రూ.45,22,202, సోమవారం రూ.8 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. గతేడాది సుమారు రూ.39లక్షలురాగా ఈయేడాది సుమారు రూ.20 లక్షలు పెరిగింది.

కొంపముంచిన కుమ్ములాటలు

- దుబ్బాక మున్సిపాలిటీలో బాధ్యతను మరిచిన పాలకవర్గం
- శాపంగా మారిన ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- పట్టణంలో అభివృద్ధి పనులపై అశ్రద్ధ
- ఫలితంగా గతంలో మంజూరైన నిధులు వెనక్కి

దుబ్బాక, జనవరి 24 : గతంలో దుబ్బాక వేదికగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా నేడు పట్టణ ప్రగతి తిరోగమన దిశలో నడుస్తున్నది. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మున్సిపాలిటీకి శాపంగా మారింది. నాలుగేళ్లుగా మున్సిపల్ పాలకమండలిలోని కుమ్ములాటలు అభివృద్ధికి ఆటంకంగా మారాయి. పట్టణంలో కొత్త పనులు దేవుడెరుగు.. మంజూరైన వాటిని పూర్తి చేయలేకపోయారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలను మంజూరు చేయించుకుని, ఏళ్ల తరబడి మురగబెట్టి వాటిని రద్దు అయ్యేలా చేశారు.

రూ.10 కోట్ల నిధులు నిలిపివేత

దుబ్బాకలోని 20 వార్డులకు ఏడాది క్రితం టీయూఎఫ్ఐడీసీ కింద రూ.10 కోట్లను మంజూరు చేశారు. వార్డుకు రూ.25 లక్షల చొప్పున పనులు చేపట్టాల్సి ఉండగా పాలకమండలి సమన్వయలోపం కారణంగా సకాలంలో ప్రభుత్వానికి అంచనాలను అందించలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం వాటిని తాత్కాలికంగా నిలిపివేసింది. వీటితోపాటే సిద్దిపేట మున్సిపాలిటీకి మంజూరు అయిన నిధులను వారు సద్వినియోగం చేసుకున్నారు. పాలకమండలి పనులను చేపట్టడంతో సిద్దిపేటలో అభివృద్ధి ఫలితాలు కనిపిస్తున్నాయి. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌ల నిర్లక్ష్య ధోరణితో నిధులు నిలిపివేయబడ్డాయని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సొంత భవనం లేక అతిథి విడిది భవనంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్యాలయం


రామసముద్రం సుందరీకరణలో భాగంగా పూర్తి కాని పాదచారుల రహదారి

మైనార్టీ, బీసీబంధు చెక్‌లు ఇవ్వలేదు

కౌన్సిలర్‌లు, చైర్‌పర్సన్ ఆధిపత్య పోరుతో పట్టణంలో బీసీ, మైనార్టీ సంక్షేమ, ఎస్టీ కార్పొరేషన్ నిధులు లబ్ధిదారులకు అందకుండాపోయాయి. 2021 నుంచి ఎస్టీ కార్పొరేషన్ నిధులను మంజూరు చేసినా ఒక్కరికి ఇవ్వలేదు. 44 మంది బీసీలకు బీసీబంధును మంజూరు చేసి చెక్‌లను సిద్ధం చేసినా వాటి పంపిణీ బాధ్యతను మున్సిపల్ నాయకులు తీసుకోకపోవడంతోపాటు నిలిచిపోయాయి. అంతేకాకుండా మొదటివిడుత 40 మందికి బీసీబంధు చెక్‌లు ఇచ్చినా అందులో వచ్చిన పర్సెంటేజీల వ్యవహారంలో విభేదాలతో తిరిగి తీసుకుని విమర్శలపాలయ్యారు. మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్‌లను ప్రభుత్వం మంజూరు చేసినా వాటిని కలెక్టరేట్‌లోనే ఉంచారు. మైనార్టీబంధు ద్వారా 17 చెక్‌లు సిద్ధమైనాపాలకవర్గం పట్టింపులేనితనంతో వెనక్కిపోయాయి.

డబుల్ బెడ్రూం ఇళ్ల వ్యథ

దుబ్బాక పట్టణానికి ఏడేళ్ల క్రితం వెయ్యి డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేశారు. అందులో ఇప్పటి వరకు 896 ఇళ్లను పూర్తి చేశారు. వీటిలో లబ్ధిదారుల ఎంపిక జరగకుండానే కొంతమంది గృహప్రవేశం చేశారు. అందులో కనీస వసతుల కల్పన కోసం ఇప్పటి వరకు పాలకమండలి పట్టించుకున్న పాపాన పోలేదు. అసలైన లబ్ధిదారులకు ఇప్పటికీ పట్టాలను అందించలేదు. సుమారు 104 ఇళ్లు వెనక్కిపోయాయి. హమాలీ కాలనీలో 84 ఇళ్లు పూర్తి అయినప్పటికీ లబ్ధిదారులకు అందించాలనే బాధ్యతను తీసుకునే నాథుడే కరువయ్యారు.

ఎన్నో పనులు.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

పాలకమండలి అశ్రద్ధతో ఇప్పటివరకు కనీసం మున్సిపాలిటీకి సొంత భవనానికి కూడా నోచుకోలేదు. రూ.5 కోట్ల మంజూరు అయ్యి రద్దయ్యాయి. ఐటీఐ కళాశాల భవన నిర్మాణం, రామసముద్రం చెరువుకట్ట సుందరీకరణ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. చైర్‌పర్సన్ సొంత వార్డులో రూ.25 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కల్యాణ మండపం సమీపంలో రూ.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ భవనం పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ఎఫ్ఎస్‌డీపీ కింద మానవ ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని నిర్మించినా వినియోగంలోకి తేలేదు.



ఆరేళ్లుగా తెరుచుకోని శ్మశానవాటిక

దుబ్బాక మున్సిపల్ పరిధిలో ఆరేళ్ల క్రితం ప్రారంభించిన వైకుంఠధామం ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. రూ.50 లక్షలతో వ్యయంతో నిర్మించగా చిన్నచిన్న పనులు మినహా నిర్మాణం పూర్తి అయింది. అయినా ఇప్పటికీ గేట్లు తెరుచుకోలేదు. దీంతో పట్టణంలో మృతదేహాలను ఆరుబయటనే దహనం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. గేటుకు ఎదురుగానే దహన సంస్కారాలు పూర్తి చేస్తున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆడిటోరియం, టౌన్‌హాల్ కథ కంచికే!

పాలకమండలి నిర్లక్ష్యంగా పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆడిటోరియాన్ని నిర్మించలేకపోయారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు కోసం అప్పటి ప్రభుత్వం రూ.3.80 కోట్లను మంజూరు చేసింది. దీనికి టెండర్ పూర్తయిన కానీ స్థలాన్ని చూపెట్టకపోవడంతో నాలుగేళ్లుగా ఆ నిధులు మురిగిపోతూ వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే, మరిన్ని నిధులను అందిస్తామని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించినా పాలకమండలి శ్రద్ధ చూపలేదు. చివరికి కొత్త ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేసింది. కూరగాయాల మార్కెట్ ప్రస్తుతం దుమ్ముదూళితో రహదారుల మధ్య కొనసాగాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇక దుబ్బాకలో ఆడిటోరియం నిర్మాణానికి రూ.2 కోట్లను మంజూరు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సీ.నారాయణరెడ్డి ఆడిటోరియం నమూనాను కూడా పరిశీలించారు. దీనికి స్థల సేకరణ చేయకపోవడంతో నాలుగేళ్లుగా నిధులు మురిగిపోయాయి. చివరికి కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. అధునాతన హంగులతో నిర్మించాల్సిన టౌన్‌హాల్ కథ ఇలాగే ఉంది. ఏడేళ్ల క్రితం నిధులను మంజూరు చేసి అప్పటి సీఎం కేసీఆర్ పనులు చేపట్టాలని ఆదేశించినా పట్టించుకోలేదు. టౌన్‌హాల్ కోసం వేసిన శిలాఫలకవే శిథిలమైపోయింది.


ప్రారంభానికి నోచుకోని చిల్డ్రన్ పార్కు

ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- సమస్యలను పరిష్కరించి నమ్మకం కలిగించండి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 29 : ప్రజావాణిలో వచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో ప్రజలు వస్తారని వారి సమస్యలను పరిష్కరించి నమ్మకం కలిగించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల్లో కొన్ని ముఖ్యమైనవి ఈ విధంగా ఉన్నాయి. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో పట్టాలు పొందిన వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఆ గ్రామస్థులు కోరారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో 2.30 ఎకరాల భూమిలో వంద మంది రైతులు 30 సంవత్సరాలుగా పశుపోషణ చేసుకుంటూ కోళ్ల ఫారాలు నిర్వహిస్తూ బతుకుతున్నారని, ఆ గ్రామ సర్పంచ్ దౌర్జన్యంగా గ్రామ కంఠం భూమి అంటూ అక్రమ కేసులు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని రైతులు కోరారు. సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన నాగమణి తమ భూమిలో పక్క భూమివారు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 27, వివిధ శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు రాగా మొత్తం 76 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలి : మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 29: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. ప్రజావాణికి అందిన ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో నలుమూలల నుంచి 95 దరఖాస్తులు వచ్చాయి. అందులో భూ సమస్యలు 54, జనరల్ 23, పింఛన్లు 13, ఉపాధి 3, సర్వే, భూరికార్డులపై రెండు వినతులు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజావాణిలో వచ్చిన వాటిని పెండింగ్‌లో లేకుండా పరిష్కారించాని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

అబద్ధాలు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి

జోగిపేట, జనవరి 29: అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి, అసెంబ్లీ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూధనాచారి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం అందోలు శివార్లలోని ఓ ఫంక్షన్‌హాల్లో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలు, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు వ్యూహ్యాలపై ప్రధానంగా చర్చించారు. పార్టీ ముఖ్యకార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యాలు ఏంటో వారికే తెలియడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పరనింద తప్ప చేసేదేంటో మాత్రం చెప్పడం లేదన్నారు. బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారాలే వారి అజెండాగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు కరెంట్, నీటి కష్టాలు లేక సుభిక్షంగా ఉన్నారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడవక ముందే కరెంట్ కోతలు, నీటి కష్టాలు మొదలయ్యాయని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఆపార్టీ ఇచ్చిన హామీలపై నీలదిస్తే ముఖ్యమంత్రి మొదలు మంత్రులకు కోపం వస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారకాంక్షతో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ పనితీరుని క్షేత్రస్థాయి ప్రజలకు వివరించి రాబోయే ఎంపీ ఎలక్షన్స్‌లో భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ, బీఆర్సే పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్, ముఖ్య నాయకులు సాయికుమార్, వీరారెడ్డి, పల్లె సంజీవయ్య, జోగినాథ్, జోగిపేట మున్సిపల్ చెర్మెన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్‌లు, అన్ని మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, సర్పంచ్ లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గుమ్మడిదల శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

పోలీస్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

గుమ్మడిదల, జనవరి 29 : గుమ్మడిదల మండల కేంద్రంలో నూతన పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని, ప్లాన్‌ను సోమవారం ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ జాతీయ రహదారి 765-డిని ఆనుకొని, గుమ్మడిదల ప్రైమరీ హెల్త్‌సెంటర్ పక్కన 1.17 గుంటలో అధునాతన హంగులతో గుమ్మడిదల నూతన పోలీసుస్టేషన్ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు హెటిరో గ్రూప్ చేపట్టనున్నట్లు వివరించారు. అయన వెంట హెటిరో గ్రూప్ ఆఫ్ మేనేజర్ రామోమోహన్‌రెడ్డి, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్


దరఖాస్తు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 29: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. మొత్తం 27 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన తుర్కపల్లి తండావాసులు

ఒకే తండా నుంచి 9 మంది స్టాఫ్‌నర్సులు

నారాయణఖేడ్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్‌నర్సుల మేల్, ఫీమేల్ ఎంపికకు సంబంధించి ఫలితాలను విడుదల చేయగా నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి తండాకు చెందిన తొమ్మిది మంది ఒకేసారి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్‌నర్సుల నియామకం కోసం 2022లో నోటిఫికేషన్ విడుదల చేయగా గతేడాది పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేయడంతో తండాకు చెందిన విజయ్, వినోద్, రాజు, మోహన్, సంగ్రాం, చైతన్, రజిత, మౌనిక, ప్రియాంక ఎంపికయ్యారు. తండాకు చెందిన తొమ్మిది మంది స్టాఫ్‌నర్సులుగా ఎంపిక కావడంపై కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు నెహ్రూనాయక్ ఆనందం వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ పోయిందా..

- సీఐఈఆర్‌లో లాగిన్ అయితే త్వరగా పట్టుకుంటాం : సీపీ


సెల్‌ఫోన్‌లను దక్కించుకున్న బాధితులతో సీపీ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 29 : సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఐఈఆర్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకుంటే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టవచ్చని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. పోగొట్టుకున్న 30 సెల్‌ఫోన్లను సీఐఈఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 2001 మంది ఫోన్లు పోయినట్లు గుర్తించామని, వాటిలో 612 సెల్‌ఫోన్లను ట్రేస్ అవుట్ చేసి, 330 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఐటీ కోడ్ సిబ్బంది శ్రీకాంత్, స్వప్న, మల్లేశం పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలి

- సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

జిన్నారం, జనవరి 29 : పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసుల్లో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. కేసుల పరిశోధనకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్య సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఎస్ఐ విజయ్‌రావు, సిబ్బంది ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

చేర్యాల అభివృద్ధి సరే.. మురుగు నీటికి దారేదీ?

- రోడ్డువిస్తరణ కాలువ పనుల్లో భాగంగా పాత మురుగునీటి కాలువ తొలగింపు
- కొత్త కాలువ వర్షపు నీటికే తప్ప మురుగు నీటి మళ్లింపుకోసం కాదంటున్న ఎన్‌హెచ్ అధికారులు
- పట్టణవాసులను వేధిస్తున్న డ్రైనేజీ సమస్య


ప్రత్యామ్నాయ మార్గం లేక నిలిచిన మురుగునీరు



విద్యుత్ స్తంభం అడ్డురావడంతో నిలిచిన కాలువ పనులు, నివాసాల పక్కనే మురుగునీటి నుంచి వెళ్తున్న భగీరథ పైప్‌లైన్

చేర్యాల, జనవరి 29 : జనగామ-సిద్దిపేట ప్రధానరహదారి నిర్మాణంతో చేర్యాల పట్టణానికి నూతనశోభ సంతరించుకుంటుందని హర్షిస్తుండగా మరోవైపు డ్రైనేజీ సమస్య వెంటాడుతుండటంతో ప్రజలు ఉసూరుమంటున్నారు. గతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చాన్నాళ్లక్రితం ప్రధాన రహదారి వెంబడి కాలువ నిర్మించి కొంతమేర క్రమబద్ధీకరించారు. కానీ ప్రస్తుతం రోడ్డువిస్తరణలో భాగంగా ఇరువైపులా 45ఫీట్ల దూరంలో కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా గతంలో నిర్మించిన డ్రైనేజీని కూల్చివేస్తున్నారు. కాగా ప్రస్తుతం చేపట్టిన కాలువ కేవలం రోడ్డుపై పడిన వర్షపునీటి మళ్లింపుకోసమేనని, డ్రైనేజీ నీటి మళ్లింపు కోసం కాదని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. దీంతో మురుగునీటి ప్రవాహానికి ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం తీవ్ర సమస్యగా పరిణమించింది.

మురుగు కంపుతో జనం ఉక్కిరిబిక్కిరి

ప్రస్తుతానికి నివాసాల వైపు కాలువ నిర్మాణం కోసం తీసిన గోతుల్లో మురుగునీరు నిల్వ ఉంటుంది. దీంతో నివాస పరిసరాల్లో దుర్గంధం వ్యాపించి దోమలు వృద్ధి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా తాగునీరు సరఫరా చేసే భగీరథ పైప్‌లైన్ మురుగునీటి నుంచే ఉండడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు వ్యక్తం చేస్తున్నారు. కాలువ పనుల్లో భాగంగా పలు చోట్ల గోతులు తీసి అనివార్య కారణాలతో అర్థాంతరంగా వదిలేసి మరో ప్రదేశంలో చేపడుతున్నారు. చాలాకాలంగా కొనసాగుతున్న ఈ పనుల కారణంగా విపరీతంగా దుమ్ము చెలరేగుతూ ప్రజలు శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు మురుగునీరు వెళ్లేందుకు దారి లేక దుర్గంధం వ్యాపించడంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ప్రత్యేక డ్రైనేజీ ఏర్పాటు చేస్తే ఇళ్ల యజమానులకు మరింత నష్టం!

కాగా 45ఫీట్లలో కాలువ అనంతరం 5ఫీట్లవెడల్పులో విద్యుత్‌స్తంభాలు, చెట్లు, వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయనుండటంతో మొత్తంగా ఇరువైపులా 50ఫీట్ల వెడల్పు రోడ్డు నిర్మాణంలో రోడ్డుపక్కన ఇళ్లు, భవనాలు పలువురు కోల్పోయే పరిస్థితి నెలకొన్నది. ఇదే కాలువలోకి డ్రైనేజీ నీటి మళ్లింపును అనుమతించకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కాలువ నిర్మాణం చేపడితే మరో 5ఫీట్ల స్థలం అవసరం కానుండటంతో పలువురు స్వల్పంగా, మరికొంతమంది సగానికిపైగా స్థలం కోల్పోయి ఇళ్ల యజమానులు మరింత నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు స్పందించి ఎవరికీ నష్టంకలిగించకుండా డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కంపు భరించలేకపోతున్నాం

రోడ్డువిస్తరణ కాలువ నిర్మాణం కోసం గతంలోని మురుగునీటికాలువ తొలగించడంతో మురుగునీరు ప్రవహించక గోతులలో నిల్వ ఉంటుంది. దుర్గంధంతో పాటు దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎవరికీ నష్టంకలిగించకుండా మురుగునీటిని మళ్లింపచేయాలి.

- ఎ. సంపత్, చేర్యాల వాసి

ఎన్‌హెచ్ అధికారులను సంప్రదించాం



గతంలోని డ్రైనేజీ కాలువ తొలగించడంతో మురుగునీటి మళ్లింపు సమస్య ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. నిబంధనల ప్రకారం వర్షపునీటి కోసమే కాలువను వినియోగించాల్సి ఉంటుంది. కానీ డ్రైనేజీ సమస్య నివారణ కోసం ఎన్‌హెచ్ అధికారులను క్షేత్రస్థాయి పరిశీలన కోసం రావాలని కోరాం. రెండు, మూడు రోజుల్లో పరిశీలన జరిపి తగిన నిర్ణయం తీసుకుంటాం.

- రాజేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్

డ్రైనేజీ నీరు అనుమతించబోము

రోడ్డుపై కురిసిన వర్షపునీరు మళ్లించడం కోసం మాత్రమే కాలువ నిర్మాణం చేపట్టాము. డ్రైనేజీ నీటి మళ్లింపు అనుమతించబోము. ఇళ్లు, భవనాల మురుగునీటి మళ్లింపు విషయంలో మున్సిపాలిటీ నిర్ణయం తీసుకుంటుంది.

- కిరణ్, ఎన్‌హెచ్ డీఈ

పేకాట స్థావరం పై దాడి.. అదుపులో నలుగురు

సిద్దిపేట అర్బన్, జనవరి 29: సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని సోమవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. వారి నుంచి రూ.55 వేల నగదు, మూడు మోటార్ సైకిల్ నాలుగు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

- కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, జనవరి 29: హుస్నాబాద్ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలన్నారు. ఇదే కాకుండా పట్టణంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న భవన యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరం నష్టపోయిన పంటలకు ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని, ఈ పరిహారం అందించాలని కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

దుబ్బాకలో సెల్ఫ్ విజార్డ్ డ్రామా పోటీలు

దుబ్బాక, జనవరి 29: దుబ్బాకలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సోమవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో మండల స్థాయిలో సెల్ఫ్ విజార్డ్ మరియు డ్రామా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో వర్ష జడ్పీజీహెచ్ఎస్ (దుబ్బాక), ద్వితీయ స్థానంలో ప్రతి జడ్పీహెచ్ఎస్ ఆకారం, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి శ్రీజ మొదటి స్థానం తెలంగాణ మోడల్ స్కూల్, ద్వితీయ స్థానంలో అక్షయ కేజీబీవీ దుబ్బాక విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, ఎల్టా నిర్వాహకులు సయ్యద్ ముజీబ్, ఉమామహేశ్వర్, పల్లె శ్రీనివాస్ గౌడ్, యాదగిరి తదితరులున్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

నంగునూరు, జనవరి 29: మండలంలోని రాజగోపాల్‌పేటలో న్యాక్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ ఎలా రాజేందర్ చేతుల మీదుగా మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు సహకారంతో మూడు నెలలుగా గ్రామంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాక్ స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ రాము, ఇన్‌చార్జి ప్రవీణ్, బాల్‌నర్సు, నాయకులు ఎండీ కమల్ షరీఫ్, రంగు రాజుగౌడ్ గ్రామస్థులు పాల్గొన్నారు

జాలపల్లిలో కాంగ్రెస్ గ్రామ కమిటీ

మద్దూరు, జనవరి 29 : దూళిమిట్ట మండలం జాలపల్లిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి మద్దూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్‌యాదవ్ తెలిపారు. అధ్యక్షుడిగా బందారం సాగర్, ఉపాధ్యక్షుడిగా వట్టిపల్లి అశోక్, జక్కుస్వామి, ప్రధాన కార్యదర్శిగా గొట్టం సాంబరెడ్డి, కోశాధికారిగా మెత్కు లింగం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా నాగులపల్లి బాను, కార్యవర్గసభ్యులుగా అంగడి సంపత్, గుండెల్లి సంపతి, లంబ కొమురయ్య, లింగాల సంపతి, బందారం బాలయ్య, రాగుల మైసయ్య, గౌరవ సలహాదారుగా గంగుల యాదగిరి ఎన్నికైనట్లు తెలిపారు.

అయోధ్య శ్రీరాముని చిత్రపటాల వితరణ

హుస్నాబాద్, జనవరి 29 : పట్టణంలో సోమవారం అయోధ్య శ్రీరాముని చిత్ర పటాలను బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రతీ కుటుంబానికి శ్రీరాముని చిత్ర పటాన్ని అందించాలనే సంకల్పించడంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. మొదట పట్టణంలోని మార్కండేయ ఆలయంలోని శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, గుజ్జ శ్రీనివాస్‌రావు, జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, తదితరులున్నారు.

జడ్పీటీసీ నిధులతో పాఠశాల ప్రహరీ నిర్మాణం

మద్దూరు, జనవరి 29: దూళిమిట్ట మండలం జాలపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి ఇచ్చిన నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమలాకర్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడారు. విద్యావైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాధాన్యతనిస్తోందన్నారు.

మోతెలో ఉచిత వైద్యశిబిరం

మిరుదొడ్డి, జనవరి 29: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో సోమవారం సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని సుమారు 300 మందికి వైద్యపరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచు శ్రీనివాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ రథం ప్రారంభం

మిరుదొడ్డి, జనవరి 29: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో సోమవారం వైకుంఠ రథాన్ని ఆ గ్రామసర్పంచు కాలేరు శ్రీనివాస్ ప్రారంభించారు. వైకుంఠ రథానికి సహకరించిన దాతలు కృతజ్ఞతలు తెలిపారు.

వీరన్నపేటలో పశువైద్యశిబిరం

చేర్యాల, జనవరి 29 : మండలంలోని వీరన్నపేట గ్రామంలో పశువైద్య సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ సిద్దిపేట ఏడీ కొండల్ రెడ్డి, చేర్యాల ఏడీ రాజిరెడ్డి, కొమురవెల్లి వైద్యాధి కారి విజయసారథి 50పశువులకు చికిత్సలు చేశారు.

యువత క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్ది పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 29: యువత క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలని, విద్యతో పాటు క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సూచించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నంగునూర్ మండలం పాలమాకుల గ్రామ యూత్ ఆధ్వర్యంలో టీహెచ్ఆర్ సీజన్2 వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మాజీ మంత్రి హరీశ్‌రావు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందుండాలని, రేపటి తరానికి యువత ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలిచిన పాలమాకుల గ్రామ జట్టుకు, రన్నర్‌గా నిలిచిన చందలపూర్ గ్రామ యూత్‌కు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మేర సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట ఇమాంబాద్ గ్రామానికి చెందిన నాయిని మహేందర్‌రెడ్డి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను, రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు.

గర్భిణులు ప్రశాంతంగా ఉండాలి

సిద్దిపేట అర్బన్, జనవరి 29: గర్భిణులు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటే పుట్టబోయే బిడ్డ ఆయురారోగ్యాలతో జన్మిస్తుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రామకృష్ణ మఠం వారు సోమవారం సిద్దిపేట విపంచి కళా నిలయంలో నిర్వహించిన గర్భిణుల అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రామకృష్ణ మఠం వారు సమాజహితం కొరకు ఇలాంటి కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మఠం సభ్యులతో పాటు మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, మాజీ సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు పాల్గొన్నారు.

15వ ఫైనాన్స్ నిధుల వినియోగంపై ప్రత్యేక సమావేశం


ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు

మద్దూరు, జనవరి 29: 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ గ్రామాల అభివృద్ధికి వచ్చిన 15వ ఫైనాన్స్ నిధులతో మౌలిక వసతులు కల్పించేందుకు ఎంపీటీసీ సభ్యుల నుంచి అధికారులు పనుల ప్రపోజల్స్ తీసుకున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గ్రామాల పరిధిలో ఎక్కువ నిధులు కేటాయించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. మూడేళ్ల క్రితం చేపట్టిన పనులకు నేటి వరకు బిల్లు చెల్లించలేదని తోర్నాల ఎంపీటీసీ ఆకుల యాదగిరి తెలిపారు. కొండాపూర్‌లో చేపట్టిన పనికి నేటికీ ప్రొసీడింగ్ ఇవ్వలేదని ఎంపీటీసీ నముకు దృష్టికి తీసుకువచ్చారు. జాలపల్లి గ్రామానికి ఈసారి ఎక్కువ నిధులు ఇవ్వాలని ఎంపీటీసీ కల్యాణికమలాకర్ కోరారు. 15 ఫైనాన్స్ నిధులు అందరి ఎంపీటీసీలకు సమానంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌కు ఎంపీపీ సూచించారు. పనులు తొందరగా చేపట్టాలని ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతమల్లేశం, పీఆర్ఏఈ వినయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి, తహసీల్దార్లు అనంతరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవో నర్సింహారెడ్డి, వైద్యాధికారి రజిత, సీహెచ్‌వో శేషగిరి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యమివ్వాలి

కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐలతో సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ


సీపీ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న తొగుట సీఐ లతీఫ్, టూటౌన్ సీఐ ఉపేందర్, రూరల్ సీఐ ఎం. శ్రీను


బాధ్యతలు స్వీకరిస్తున్న సిద్దిపేట త్రీటౌన్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, చేర్యాల సీఐ ఎల్ శ్రీను

సిద్దిపేటరూరల్/సిద్దిపేట క్రైం/ సిద్దిపేట అర్బన్/ తొగుట/ చేర్యాల, జనవరి 29: శాంతి భద్రతలకు పెద్ద పీట వేయాలని, సైబర్ నేరాలను అరికట్టాలని జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ పేర్కొన్నారు. జిల్లాలో బదిలీలపై వెళ్లిన పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సోమవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు సీపీని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కలను బహూకరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహించాలని సూచించారు. కాగా సిద్దిపేటలోని టూటౌన్, త్రీటౌన్, రూరల్ సీఐలుగా ఉపేందర్, సీహెచ్ విద్యాసాగర్, ఎం. శ్రీను, తొగుట సీఐగా ఎస్‌కే లతీఫ్, చేర్యాల సీఐగా ఎల్ శ్రీను సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి


గజ్వేల్: ప్రజ్ఞాపూర్ రాణే బ్రేక్ వద్ద సంతకాల సేకరణలో పాల్గొన్న చుక్కా రాములు

గజ్వేల్, జనవరి 29: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాణే పరిశ్రమ వద్ద సంతకాల సేకరణను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికవర్గం, గ్రామీణ ప్రాంతంలో రైతాంగం బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, యూనియన్ నాయకులు భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహులు, మల్లయ్య, రంగారెడ్డి, వెంకట్రావు, తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆందోళనలకు సిద్ధం

సిద్దిపేట అర్బన్, జనవరి 29 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలో సీఐటీయూ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్‌బీఆర్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కరపత్రాల పంపిణీ ఉంటుందన్నారు. 16న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు బాలు పాల్గొన్నారు.


మంత్రి పొన్నంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయీబ్రాహ్మణులు

మంత్రి పొన్నంకు నాయీబ్రాహ్మణుల వినతి

మద్దూరు, జనవరి 29: జిల్లాలోని నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉమ్మడి మద్దూరు, దూళిమిట్ట మండలాల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొండారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జాలిగామ విద్యాకర్ బీసీ సంక్షేమశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి కలిసినవారిలో నాయకులు నరేందర్, స్వామి, కనకయ్య శ్రీనివాస్, వెంకట్‌స్వామి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ డాటా ఎంట్రీలో నిర్లక్ష్యం తగదు: డీఐవో

మద్దూరు, జనవరి 29: రొటీన్ ఇమ్యూనైజేషన్ ఇంప్రూవ్ చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండటం తగదని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ విజయారాణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వాక్సిన్ స్టోర్‌తో పాటు రిజిష్టర్లను పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది పనులు చేపడుతున్నప్పటికీ ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ చేయకపోవడం వల్ల స్టేట్ లెవల్లో రిఫ్లెక్ట్ కావడం లేదన్నారు. చిన్నపిల్లలకు ఇచ్చే వాక్సిన్ యాప్‌లో ఏఎన్ఎంలు ఎంట్రీ చేయడంతో పాటు ఇచ్చే సర్వీస్‌ఎల్‌లో హెచ్ఎంఎస్ పోర్టల్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రజిత, సీహెచ్‌వో జి. శేషగిరి, హెచ్ఎస్ రఘు, ఫార్మాసిస్ట్ సందీప్, స్టాఫ్‌నర్స్ మాధవి ఉన్నారు.

గణిత విభాగం పరిశోధకుడు నరేష్‌కు డాక్టరేట్


పట్టా అందుకుంటున్న పరకాల నరేష్

చిన్నకోడూరు, జనవరి 29 : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం గణిత విభాగం పరిశోధకుడు పరకాల నరేష్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎం. రమేష్‌కుమార్ సోమవారం ప్రకటించారు. ఏ స్టడీ ఆన్ మల్టీ డైమెన్షనల్ ఫిక్స్ పాయింట్ రిజల్ట్స్ ఆన్ వేరియస్ మెట్రిక్ స్పేసెస్ విత్ అప్లికేషన్స్ అనే అంశంపై మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం మ్యాథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. జి. ఉపేందర్‌రెడ్డి పర్యవేక్షణలో నరేష్ పరిశోధన పూర్తి చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన నరేష్ శ్రీనిధి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఘట్‌కేసర్ గణిత విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 25 కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఈ సందర్భంగా నరేష్‌ను ప్రొఫెసర్‌లు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

విద్యుత్‌లైన్ సవరణ పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, జనవరి 29 : చేర్యాల పట్టణంలో విద్యుత్ లైన్ సవరణ పనులు ప్రారంభించిన నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండటం వలన ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాల మండల పరిధిలోని వీరన్నపేట శివారునుండి కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల శివారు వరకు సుమారు 290విద్యుత్ స్తంభాలు, పలు ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుమధ్యకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఈ విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌స్తంభాలు' శీర్షికన ప్రచురితమైన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి విద్యుత్‌లైన్ సవరణ పనులు చేపడుతున్నారు. కాగా ముందస్తు షెడ్యూల్ ప్రకారం కాకుండా పనులు చేపడుతుండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో అంతరాయం ఏర్పడి ప్రజలు, చిరువ్యాపారులు ఇబ్బందులుపడుతున్నారు.

సర్పంచులకు సన్మానం


ఎంపీపీ కార్యాలయంలో సర్పంచులను సన్మానించిన దృశ్యం

బెజ్జంకి, జనవరి 29 : సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాము గ్రామాల్లోని సర్పంచులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులను శాలువాలతో సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ కవిత, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రకళ, సర్పంచులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

టీ-సాట్ చానల్‌లో ఉపాధ్యాయురాలికి అవకాశం


క్రాంతికుమారి

ములుగు, జనవరి 29: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఎం. క్రాంతికుమారికి టీ-సాట్ నిపుణ చానల్ పాల్గొనే అవకాశం లభించింది. పాఠశాలలో విద్యార్థి కేంద్రీకృతంగా వినూత్న బోధనా పద్ధతులతో బోధిస్తున్న రాష్ట్రంలోని ముగ్గురిని ఎంచుకోగా అందులో ములుగు పాఠశాల ఉపాధ్యాయురాలు క్రాంతికుమారి ఒకరు. ఈ నెల 31న నిర్వహించే చానల్ లైవ్ టెలీకాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానించారు. క్రాంతికుమారిని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి ఉదయ భాస్కర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు అభినందించారు.

అంతర్జాతీయ కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు


అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటిన 'కస్తూర్బాగాంధీ' బాలికలు

మిరుదొడ్డి, జనవరి 29: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మిరుదొడ్డి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని సోమవారం యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు మాస్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో వరల్డ్ నకయమా షోటోకాల్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో రెండో అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ కరాటే పోటీల్లో మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన 17మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్టు తెలిపారు. హరిణి, భవాని, ప్రత్యూష, అక్షయ, ప్రసన్నలక్ష్మీ, సంజన, రవళి, దీక్షిత, ఆకాంక్ష, రమ్య, దివ్య గోల్డ్‌మెడల్స్, 9మంది విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించినట్టు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రత్యేకాధికారి స్వర్ణలత అభినందించారు.

ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

బెజ్జంకి, జనవరి 29: మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేక మాజీ ఎమ్మెల్యే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాములు,యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, టౌన్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై టీఎన్‌జీవోస్ నిరంతర పోరాటం


గజ్వేల్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎన్‌జీవో నాయకులు

గజ్వేల్, జనవరి 29: ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం టీఎన్‌జీవో మాత్రమేనని టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో టీఎన్‌జీవోల క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి టీఎన్జీవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎన్జీవోస్ సంఘం ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ఆ సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో టీఎన్జీవో గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు బి.లింగం, సిద్దిపేట జిల్లా సహాధ్యక్షుడు నిమ్మ సురేందర్‌రెడ్డి, కోశాధికారి అశ్వక్ అహ్మద్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జేబీనా, సుల్తానా, కార్యదర్శి నాగభూషణం, కార్యవర్గ సభ్యురాలు శ్వేత గజ్వేల్ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సహాధ్యక్షులు శ్రీనివాస్, శివప్రసాద్, కోశాధికారి ప్రవీణ్, జానకిరామ్, శ్రీనివాస్, షేక్ బిలాల్, వికాస్ రెడ్డి, నరేష్‌చారి, తిరుపతి, వేణు, లక్ష్మి, అనిత, జ్యోతి, భారత్, రాజు, సంతోష్ కుమార్, పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మేధస్సుకు పదును

నారాయణరావుపేట, జనవరి 29: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మేదస్సుకు పదును పెట్టాలని ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు డిజిటల్ కాంటెంట్ స్టడీ మెటీరియల్‌ని మాజీ మంత్రి హరీశ్‌రావు సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఏల్లయ్య, సర్పంచ్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు కిషన్, యాదగిరి, ఆకుల డబీష్, దేవారాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

- యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చింతల రాజ్‌వీర్

నారాయణరావుపేట, జనవరి 29: కాంగ్రెస్‌పార్టీ పాత తరం నాయకులను, కొత్త తరం నాయకులను అనుసంధానం చేసుకుంటూ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ పేర్కొన్నారు. సోమవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌వీర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు రంగనాయక సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేందుకు ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషిచేయాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రాగుల అశోక్, తీగల భాస్కర్, బాలయ్య, పరశురాములు, కనకయ్య, హరికృష్ణ, హైమద్ పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

చేర్యాల, జనవరి 29 : చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన పలువురి రైతుల వరి పొలాలను ఏడీఏ రాధిక సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి చేలలో మొగి పురుగు, కాండం తొలుచు పురుగు ప్రభావాన్ని పరిశీలించి నివారణ చర్యలను సూచించారు. యూరియా వినియోగం తగ్గించాలని సూచించారు. ఈసందర్భగా ఆమె వెంట నాగపురి రైతుసేవ ఎస్‌పీఎస్ చైర్మన్ జక్కుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొమురవెల్లి మండలం ఐనాపూర్, పోసాన్‌పల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారి నరేశ్ సోమవారం వరిపంట పొలాలను పరిశీలించారు. మొగిపురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు తీసకోవాలని సూచించారు. తల్లిరెక్కల పురుగు నియంత్రణకు సాయంత్రం వేళలో గట్టుచివరన లైట్ ట్రాప్ లేదా చిన్నపాటి మంట పెడితే ఆకర్షించి చనిపోతాయన్నారు. పురుగు ఉధృతి తెలుసుకోవడానికి ఎకరానికి ఎనిమిది లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలని, కలుపు తీసిన రైతులు ఎకరానికి 15కిలోల పొటాష్, 15కిలోల యూరియా చల్లాలని సూచించారు.